క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

వాంకిడి: భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ సంఘం నూతన మండల కార్యవర్గాన్ని గురువారం జేత్వాన్ బుద్ద విహారలో ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా దుర్గం దుర్గాజీ, ఉప్రె విజయ్‌కుమార్, సమాజ్ అధ్యక్షులుగా శ్యాంరావు లహుజీ దుర్గె, రాజేశ్వర్ ఉప్రె ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ వచ్చేనెల 10 నుంచి ప్రారంభమయ్యే వర్షవాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టీఎన్జీవోఎస్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని ట్రెజరీ కార్యాలయంలో గురువారం టీఎన్జీవోఎస్ నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా డి.దేవేందర్, కార్యదర్శిగా కుమురం అర్జున్, కోశాధికారిగా ఎస్.తిరుపతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు నూతన సభ్యులను సన్మానించి శుభాకంక్షలు తెలిపారు. ఎన్నికల అధికారిగా కుమురం నందారాం వ్యవహరించారు. సంఘం నాయకులు రాజశేఖర్, శ్రీనివాస్, దేవాజీ, సంజీవ్‌కుమార్, మీనజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి సాహూ మహరాజ్ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహారలో ఛత్రపతి సాహూ మహరాజ్ 151వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు దుర్గం దుర్గాజీ, కార్యదర్శి విజయ్ ఉప్రె, ఎస్ఎస్‌డి జిల్లా ఇన్‌చార్జి దుర్గం సందీప్, గౌరవ అధ్యక్షుడు జైరాం ఉప్రె, నాయకులు దుర్గం సునీల్, శ్యాంరావు, దొండు, లహుజీ, రాజేశ్వర్, గోపినాథ్, విలాస్, హంసరాజ్, రోషన్ పాల్గొన్నారు.

సీఐ, ఎస్సైలకు సన్మానం



సన్మానిస్తున్న మాలి సంఘం నాయకులు

కెరమెరి: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పోలీసులు ముందుంటారని మాలి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కొట్రంగే తిరుపతి, ఉపాధ్యక్షుడు నగేశ్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో సీఐ సత్యనారాయణ, ఎస్సై మధుకర్‌ను గురువారం సన్మానించారు. పోలీసులు ప్రజల కోసమే ఉన్నారని, వారి సమస్యల పరిష్కరమే తమ లక్ష్యమని సీఐ సత్యనారాయణ పేర్కొన్నారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకరావాలని కోరారు. కమిటీ సభ్యులు శ్రీధర్, శివరాం, బాజీరావు, బాలాజీ సకారాం, సోనేరావు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ డీఈవోను నియమించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: రెగ్యులర్ డీఈవోను నియమించాలని డీవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం కోరారు. జిల్లాకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభమై 15 రోజులవుతున్నా నేటివరకు రెగ్యులర్ డీఈవో లేక విద్యావ్యవస్థ కుంటుపడుతుందన్నారు. రెగ్యులర్ డీఈవో లేక జిల్లాలోని పాఠశాలల పర్యవేక్షణ లేక అస్తవ్యస్తంగా మారిందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవ తీసుకుని రెగ్యులర్ డీఈవోను నియమించాలని కోరారు. సంఘం నాయకులు శివ, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

దారి కష్టాలు తప్పవా?

- కోత్మీర్ నుంచి దహెగాం వరకు డబుల్ రోడ్డు మంజూరు
- నిర్మించిన కల్వర్టుల వద్ద పోసిన మట్టి
- వర్షాలకు బురదమయం
- దిగబడుతున్న వాహనాలు
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు



కల్వర్టు వద్ద బురద గుంతలు

దహెగాం: ఏటా వర్షాకాలం వచ్చిందంటే దహెగాం మండల వాసులకు దారి కష్టాలు వెంటాడుతున్నాయి. గత నాలుగేళ్ల క్రితం అందవెల్లి పెద్దవాగు వంతెన కూలడంతో మూడేళ్లు మండల వాసులు నరకం అనుభవించారు. వంతెన పూర్తయి గత సంవత్సరం నుంచి రాకపోకలు సజావుగా సాగుతున్నాయనుకుంటే ప్రస్తుతం డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా నిర్మించిన కల్వర్టుల వద్ద బురదగా మారడంతో వాహనాలు కూరుకుపోతున్నాయి. ద్విచక్ర వాహనదారులు జారిపడి కిందపడుతున్నారు. దీంతో వాహనదారులు పెంచికల్‌పేట్ మీదుగా ప్రయాణం చేస్తున్నారు. దూరభారం పెరగడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు.

రూ.30 కోట్లతో డబుల్ రోడ్డు మంజూరు..

మండల కేంద్రం నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి నిత్యం వందలాది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో సింగిల్ రోడ్డు ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వం ఏడాదిన్నర క్రితం కోత్మీర్ నుంచి దహెగాం వరకు సుమారు 12 కి.మీ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.30 కోట్లు నిధులు మంజూరు చేసింది. వీటి పనులు మొదలుపెట్టకపోవడంతో పలుమార్లు కథనాలు ప్రచురించడంతో ఎట్టకేలకు వేసవిలో ప్రారంభించారు. డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ముందుగా కోత్మీర్ నుంచి దహెగాం వరకు ఉన్న కల్వర్టులు నిర్మించారు. కల్వర్టులపై అక్కడే ఉన్న మట్టి పోశారు. దీంతో కురుస్తున్న వర్షాలకు బురదగా మారి పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయని వాహనదారులు, ప్రయాణికులు పేర్కొంటున్నారు. ద్విచక్రవాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొంది.

పెంచికల్‌పేట్ మీదుగా ప్రయాణం

దహెగాం నుంచి కాగజ్‌నగర్ వెళ్లడానికి రోడ్డు సరిగ్గా లేకపోవడం, ఉన్నచోట గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు పెంచికల్‌పేట్ మీదుగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. దహెగాం నుంచి కాగజ్‌నగర్‌కు 30 కి.మీ దూరానికి ప్రయాణం గంటకు పైగా పడుతుంది. పెంచికల్‌పేట్ మీదుగా 50 కి.మీ ప్రయాణం చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. దహెగాం మండలంలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలకు ఏటా రవాణా కష్టాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి బురదమయంగా మారిన కల్వర్టుల వద్ద మరమ్మతు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



దహెగాం నుంచి కాగజ్‌నగర్ వెళ్లాలంటే రోడ్డు సరిగా లేక ఇబ్బంది పడుతున్నాం. గత నాలుగేళ్ల నుంచి తిప్పలు తప్పడం లేదు. అవసరాల నిమిత్తం కాగజ్‌నగర్ వెళ్లాలంటే పెంచికల్‌పేట్ మీదుగా వెళ్లాల్సి వస్తుంది. దూరభారంతో ఇబ్బందవుతుంది. అధికారులు పట్టించుకోవాలి.

– రాజు, వాహనదారుడు

పట్టించుకోవాలి



కోత్మీర్ నుంచి దహెగాం వరకు డబుల్ రోడ్డు మంజూరుతో కష్టాలు తప్పాయని అనుకున్నాం. నిర్మించిన కల్వర్టుల వద్ద మట్టి పోయడంతో వర్షాలకు బురదగా మారింది. ఆటోలు దిగబడుతున్నాయి. కాగజ్‌నగర్‌కు వెళ్లాలంటే జంకుతున్నాం. ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి.

– చప్పిడి రాజు, ఆటోడ్రైవర్

నేడు ‘ఉపాధి’ ప్రజావేదిక

- ముగిసిన సామాజిక తనిఖీలు
- తేటతెల్లం కానున్న 536 పనులు
- ఏడాదిలో ఖర్చు చేసింది రూ.8.79 కోట్ల
- అంతంతే కూలీల భాగస్వామ్యం

గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించేందుకు ఏర్పాటు చేసిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ప్రజావేదిక నేడు కొనసాగనుంది. ప్రతిఏటా ప్రజావేదికలు కొనసాగుతున్నప్పటికి ఇందులో బయటపడిన అవకతవకలపై అనుకున్న స్థాయిలో అధికారులు స్పందించడం లేదనే కూలీలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో 536 పనులకు గాను 8.79 కోట్ల నిధులు ఖర్చు చేయగా వాటి పనితీరు నేడు తేటతెల్లం కానుంది.



మోడిలో నిర్వహిస్తున్న గ్రామసభ

కెరమెరి: గడిచిన పక్షం రోజులుగా మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో కొనసాగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలు, గ్రామసభలు గురువారంతో ముగిశాయి. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు 13వ విడత ‘ప్రజావేదిక’ నిర్వహించడం అనివార్యమైంది. 11 నుంచి 25 వరకు దాదాపు అన్ని పంచాయతీల్లోని క్షేత్రస్థాయిలో చేసిన పనులు, పనుల కొలతలు తీసుకున్నారు. ఈనెల 11 నుంచి 19 వరకు వివిధ పంచాయతీల్లో తనిఖీలు పూర్తి చేయగా, 20 నుంచి గ్రామసభలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించాక.. గ్రామసభల్లో రికార్డులు తనిఖీలు చేశారు. అయితే ప్రతిఏటా రూ.లక్షల్లో అవకతవకలు జరుగుతున్నప్పటికి జిల్లాస్థాయి అధికారులు అనుకున్న స్థాయిలో చర్యలు తీసుకోవం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిష్పక్షపాతంగా



గడిచిన పక్షం రోజుల్లో చేసిన పనులు వద్దకు సామాజిక తనిఖీ బృందం వెళ్లి పరిశీలించి కొలతలు తీసుకుంది. వారు రాసుకున్న లెక్కలు, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులపై నిష్పక్షపాతంగా ప్రజావేదిక కొనసాగనుంది.

– మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో

పొలం పనుల నేపథ్యంలో..

నేడు ప్రజావేదికలో అనుకున్న స్థాయిలో కూలీలు వచ్చే అవకాశం లేదు. పొలం పనుల నేపథ్యంలో అందరూ పొలం పనుల్లో నిమగ్నమయ్యే అవకాశం ఉంది. పొలాల్లో పనిచేసే వారే ఉపాధి పనులు చేయడంతో కూలీలు అనుకున్నస్థాయిలో రాకపోవచ్చనే తెలుస్తోంది. ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు 536 రకాల వివిధ పనులు చేశారు. దీనికి మెటీరియల్‌కు రూ.58 లక్షలు ఖర్చు చేయగా, కూలీలకు వేతనాలు రూ.8.38 కోట్లు అందజేశారు. మొత్తం రూ.8.79 కోట్లు వెచ్చించారు. మండలంలో మొత్తం జాబ్‌కార్డులు 8,370 ఉండగా..14,447 మంది కూలీలు ఉన్నారు. రోజు సరైన విధంగా పనిచేస్తే కూలీకి రూ.302 ప్రభుత్వం చెల్లిస్తుండగా..రోజు కూలీ సరాసరి రూ.239 సంపాదించాడు. కాగా, వందరోజులు పూర్తిచేసిన కూలీలు అతి తక్కువగా ఉన్నారు. సామాజిక తనికీ బృందంలో ఎస్ఆర్పీ ఒకరు ఉండగా.. డీఆర్పీలు 10, వీఎస్ఏలు 30 మంది ఉన్నారు.

ప్రైవేటీకరణ చర్యలు విరమించుకోవాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నేతలు

రెబ్బెన: సింగరేణిలో రోజురోజుకు పెరుగుతున్న ప్రైవేటీకరణ చర్యలను వెంటనే విరమించుకోవాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ అన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీల ఆధ్వర్యంలో గురువారం గోలేటి ఏరియా వర్క్‌షాప్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో ఎలక్ట్రీషియన్ల కొరత తీవ్రంగా ఉందని, యాజమాన్యం కాంట్రాక్టు టెండర్ విధానం ద్వారా నియమించడం సరికాదన్నారు. ఖాళీగా ఉన్న స్థానాలను వెంటనే కంపెనీ ఎలక్ట్రీషియన్లతో భర్తీచేయాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రీషియన్ల కొరత ఉన్నప్పటికి పనిచేసే కార్మికులపై పనిభారం పడుతున్నా ఏరియాను ఉత్పత్తి, ఉత్పాదకాల్లో తొలిస్థానంలో నిలుపుతున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితిలో ఖాళీగా ఉన్న టెక్నీషియన్ల పోస్టులు కంపెనీ ఉద్యోగులతో కాకుండా యాజమాన్యం కాంట్రాక్ట్ టెండర్ ద్వారా ప్రైవేటు వ్యక్తులను నియమించడం సరికాదన్నారు. ఇలాంటి చర్యలను వెంటనే విరమించుకోవాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జీఎం కమిటీ సభ్యులు ఆనంద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శేషు, మారం శ్రీని వాస్, ఏరియా వర్క్‌షాప్ ఫిట్ కార్యదర్శి అశోక్, వైస్ ఫిట్ కార్యదర్శి అబ్దుల్ వసీం, నాయకులు పట్ట అంజయ్య, జహంగీర్, ఇంతియాజ్ పాషా పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



కాగజ్‌నగర్‌టౌన్: ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



ఆసిఫాబాద్‌రూరల్: డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు అవగాహన ర్యాలీ



పెంచికల్‌పేట్: మాట్లాడుతున్న ఎస్సై కొమురయ్య



కాగజ్‌నగర్‌రూరల్: మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌రావు

కాగజ్‌నగర్‌టౌన్: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి అన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటుపడి తమ విలువైన భవిష్యత్తును కోల్పోతున్నారన్నారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కళాశాల యాంటీ డ్రగ్ కమిటీ కోఆర్డినేటర్ ఈ.శారద మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, డా.దేవేందర్, క్రిష్ణవేణి, దత్తాత్రేయ, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: మత్తు వద్దు కుటుంబమే ముద్దు అనే నినాదంతో ముందుకెళ్లాలని సీఐ రవీందర్, డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేర్ టేకర్ నాగరాణి అన్నారు. గిరిజన మహిళా డిగ్రీ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శారద, వైస్ ప్రిన్సిపాల్ సంధ్యరాణి, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

కెరమెరి: మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాలను నాశనం చేయొద్దని సీఐ సత్యనారాయణ అన్నారు. మోడి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంతోపాటు బారేమోడి, సుర్దాపూర్‌లో ‘యాంటీ డ్రగ్స్’పై ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. ఎస్సై మధుకర్, యువకులు, ప్రజలు ఉన్నారు.

కౌటాల: కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం నారాయణ్‌సింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఎం విజయనిర్మల, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: యువత సన్మార్గంలో నడవాలని కాగజ్‌నగర్ సీఐ శ్రీనివాస్‌రావు సూచించారు. మండలంలోని విలేజ్ నెం 12, అనుకోడ, రాంనగర్, పాఠశాలల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీసు అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బెజ్జూర్: సలుగుపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి గురువారం ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం



ప్రారంభిస్తున్న సిద్దాల దేవయ్య

సిర్పూర్(టి): మండలంలోని అచ్చెల్లి, చింతకుంట, భూపాలపట్నం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దాల దేవయ్య గురువారం ప్రారంభించారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల పనులు పూర్తిచేయాలని సూచించారు. ఏఈ ఫైజుద్దీన్, కాంగ్రెస్ నాయకులు చౌదరి తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

ఎరువులు సకాలంలో అందజేయాలి



మాట్లాడుతున్న రమేశ్

కెరమెరి: రైతులకు ఎరువులు సకాలంలో అందజేయాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సంఘంలో అధికారులు గత రెండు రోజులుగా యూరియా పంపిణీ చేస్తున్నారని, అయితే కొందరు పడిగాపులు కాస్తున్న అందడం లేదన్నారు. కొందరు ఎరువుల కృత్రిమ కొరతను సృష్టిస్తున్నట్లు ఆరోపించారు. అధికారులు యూరియా పక్కదోవ పట్టకుండా చూడాలని కోరారు.

కోతులు పట్టివేత

బెజ్జూర్: మండల కేంద్రంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో గురువారం కోతులను పట్టుకున్నారు. మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతికి చెందిన కోతులను పట్టుకునే నిపుణులతో గ్రామస్తుల చందాలు వేసుకుని వాటిని పట్టుకున్నారు. గ్రామానికి చెందిన రాచకొండ స్వప్నిల్ కుమార్, కనికుట్ల శ్రీనివాస్, ఏలేశ్వరం శ్రీకాంత్ ఆధ్వర్యంలో కౌటాల నుంచి కోతులు పట్టేవాళ్లకు తీసుకువచ్చి తదితరుల సహకారంతో వానరాలను పట్టుకున్నారు. వీటి బెడద తప్పనుండడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు మెటీరియల్ అందజేత

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులకు సైన్స్ ప్రాజెక్టుకు సంబంధించిన మెటీరియల్ అందించడం అభినందనీయమని పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ అన్నారు. ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్, స్కైనేందర్ ఎలక్ట్రిక్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన స్ప్రెడింగ్ హ్యాపీ నేస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రాస్పెల్లి పాఠశాల విద్యార్థులకు గురువారం మెటీరియల్ అందజేశారు. సోలార్ ఎనర్జీ ప్యానల్, ఓ కలర్ టీవీని అందించారు. సంస్థ ప్రతినిధి ప్రేంచంద్ వీటిని పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు నాగరాణి, రవికుమార్, స్వామి, అస్మిన్, వనిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

బావిని పూడ్చారు..

సాక్షి ఎఫెక్ట్..



రెబ్బెన: మండలంలోని పల్లవి పోటరీస్ వద్ద జాతీయ రహదారి పక్కనే ప్రమాదకరంగా ఉన్న బావిని ఎట్టకేలకు నేషనల్ హైవే అధి కారులు పూడ్చివేశారు. ప్రమాదకరంగా ఉన్న బావిపై గతనెల 14న ‘అదుపు తప్పితే అంతే సంగతి’ శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి నేషనల్ హైవే అధికారులు గురువా రం స్పందించారు. మట్టిపోసి బావిని పూడ్చివేశారు. ప్రమాదం జరగకముందే స్పందించి బావిని పూడ్చివేసేందుకు కృషి చేసిన ‘సాక్షి’కి వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.



వరదొస్తే.. అంతే

కెరమెరి మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు లక్మాపూర్, అనార్‌పల్లి వాగుల్లో వరద మొదలైంది. వాగు అవతలి వైపు ఉన్న గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులు చాలా మంది ఇళ్లకే పరిమితం కాగా, అత్యవసరం ఉన్న వారు మాత్రమే అతి కష్టం మీద వాగులు దాటుతున్నారు. గురువారం వర్షం కొంత తెరిపి నివ్వడంతో ప్రజలు రాకపోకలు సాగించారు.

– కెరమెరి

గుంతల రోడ్లు



కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ తల్లి చౌరస్తా, లారీ చౌరస్తా, ఫారెస్ట్ కార్యాలయం, తిరందాజ్ టాకీస్, అంబేద్కర్ చౌరస్తా, పొట్టి శ్రీరాములు చౌరస్తా, ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి సమీపంలోని రోడ్లపై వర్షపు నీరు నిలిచి పెదపెద్ద గుంతలుగా ఏర్పడ్డాయి. వర్షాలకు గుంతల్లో నీరు నిలుస్తోంది. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పేపర్‌మిల్లుకు వచ్చే లారీలు పెట్రోల్ పంప్ నుంచి లారీ చౌరస్తా మీదుగా వస్తుండడం, మరోపక్క రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

మహిళలకు చీరల పంపిణీ



చీరలు అందజేస్తున్న నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆషాఢమాసం ప్రారంభం సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు గురువారం బాపూనగర్‌లోని తన నివాసంలో కసాబ్‌వాడీ, బనార్‌వాడీలకు చెందిన 100 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతనెల రోజులుగా పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్నామని, అందులో భాగంగా మహిళలకు చీరలు అందిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ నాయకులు ప్రసాద్‌గౌడ్, వెంకన్న, శ్రీకాంత్, మాటూరి జయరాజ్, దీపక్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.